క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 30, పచ్చిమిర్చి 60 , బెండ 40, కాకర 50, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 70 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 160, వెల్లుల్లి 160.

4 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారద పీఠపాలిత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అష్ట వింశ బ్రహ్మోత్సవాలు ఈ నెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం శ్రీ భూ వరాహ స్వామి ద్వితీయ వార్షికోత్సవం ఉదయం 8 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచన, దీక్షాధారణ, మండపారాధన, స్వామివారికి విశేష పంచామృతాభిషేకం, విశేష అలంకారం, ప్రధాన హోమాలు, పూర్ణాహుతి, శాంతి కళ్యాణం అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.

కొండాపూర్ బెటాలియన్‌లో ఓపెన్ హౌస్



ఆయుధాలను పరిశీలిస్తున్న సంస్కృతి స్కూల్ విద్యార్థులు

గచ్చిబౌలి: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కొండాపూర్ బెటాలియన్‌లో ఓపెన్ హౌస్ ఏర్పాటు చేశారు. బుధవారం బెటాలియన్‌లో ఆయుధాలను ప్రదర్శనకు ఉంచారు. సంస్కృతి, శ్రీనిధి, కొలంబో స్కూల్ విద్యార్థులు ఓపెన్ హౌస్‌ను సందర్శించారు. ప్రజా రక్షణలో విధులు నిర్వహించే పోలీసుల వద్ద ఉండే వివిధ రకాల వెపన్స్ ఎలా పని చేస్తాయో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కె.సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్లు నర్సింహస్వామి, దేవిదాస్ విక్రమ్ రాథోడ్, రెహమాన్, సత్యనారాయణ, నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

పటాన్‌చెరు టౌన్ : ప్రయాణికురాలు ఆటోలో మరిచిపోయిన బ్యాగ్‌ను పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పి ఓ ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు.పటాన్‌చెరు సీఐ లాలూనాయక్, క్రైమ్ సీఐ శ్రీనివాసులు రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని జెపి కాలనీ రోడ్ నెంబర్-1 కు చెందిన మహేష్(25) ఆటో డ్రైవర్. మంగళవారం మధ్యాహ్నం గుల్బర్ పార్క్ కు చెందిన లలిత లింగంపల్లి నుండి మార్కెట్ వరకు వచ్చింది. ఈ క్రమంలో ఆటోలో బ్యాగ్ మర్చిపోయి దిగి వెళ్లింది. ఆ తరువాత పటాన్‌చెరుకు చేరుకున్న ఆటో డ్రైవర్ మహేష్‌కు ఆటోలో బ్యాగ్ కనిపించింది.బ్యాగు తీసి చూడగా అందులో రెండు తులాల బంగారం, బ్యాంకు పాస్ పుస్తకం, పోస్ట్ ఆఫీస్ బుక్, పాన్ కార్డు,ఏటీఎం కార్డు, కొన్ని డాక్యుమెంట్‌లు ఉన్నాయి. దీంతో అతను నేరుగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు బ్యాగ్‌ను అప్పగించాడు. పోలీసులు ఆటో డ్రైవర్‌ను అభినందించి, లలితకు బ్యాగును అందజేశారు.

యువతకు అవగాహన

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో ఓంశాంతి ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరీబాయి విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం చెడు వ్యసనాలకు యువత ఎలా దూరంగా ఉండాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి ప్రారంభించారు. యువత ఇలాంటి అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని బాల్‌రెడ్డి సూచించారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధి గాంధీనగర్‌లో తరచూ ప్రమాదాలు, చోరీలు, హత్యలు జరుగుతుండటంతో దీన్ని నివారించేందుకు బీజేపీ నేత ఆనంద్‌కృష్ణారెడ్డి ముందుకు వచ్చారు. తన సొంత నిధులు రూ.20వేలు ఖర్చు చేసి నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. కాలనీ వాసులతో ప్రారంభింపజేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఆనంద్‌కృష్ణారెడ్డి అన్నారు.

నిర్వహణ లోపం.. నిరుపయోగం

- పిచ్చిమొక్కలతో నిండిన పార్కులు
- అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు



బీకె ఎన్‌క్లేవ్ రెడ్డికాలనీ పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు



మియాపూర్: పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. లక్షలాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నా పనులు జరగడం లేదు. కొన్నిచోట్ల శిలాఫలకాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వెలువడుతున్నాయి. ఆహ్లాదాన్ని అందించాల్సిన పార్కులు పిచ్చిమొక్కలు, చెత్తచెదారంతో నిండాయి. దీంతో స్థానిక ప్రజలు అటువైపు రావడం లేదు.

- ◆ మియాపూర్‌లోని బికె ఎన్‌క్లేవ్, రెడ్డికాలనీ, నాగార్జున ఎన్‌క్లేవ్ కాలనీలోని పార్కులు చెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి.
- ◆ పార్కుల నిర్వహణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా మారాయి.
- ◆ పార్కులు కబ్జా కాకుండా బీకె ఎన్‌క్లేవ్, రెడ్డికాలనీ, నాగార్జున ఎన్‌క్లేవ్ కాలనీలో పార్కులకు ప్రహరీగోడ నిర్మించేందుకు 40 లక్షల రూపాయలు నిధులను కేటాయించారు. ఈ పనులకు గత సంవత్సరం అక్టోబర్ 14న తేదీ శంకుస్థాపన చేశారు.
- ◆ శంకుస్థాపన చేసి ఏడాది గడుస్తున్నా పనులు చేయకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల ఒక ఫీటు ఎత్తు వరకు ప్రహరీగోడ కట్టి అధికారులు మమ.. అనిపించారు.
- ◆ హరితహారంలో భాగంగా జీహెచ్‌ఎంసీ అధికారులు పార్కులలో స్థలం లేకుండా పూర్తిస్థాయిలో మొక్కలు నాటడంతో ప్రజలు అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది.
- ◆ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పార్కులను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటు హక్కు.. మన హక్కు

- పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ఇంద్రానగర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, సీఐఎస్‌ఎఫ్ జవాన్లు

హఫీజ్‌పేట్ : ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలంటూ చందానగర్‌లోని శాంతి నగర్, ఇంద్రానగర్ బస్తీలలో మంగళవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మియాపూర్ ఏసీపీ నర్సింహారావు మాట్లాడుతూ సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, మాదాపూర్ డీసీపీ సందీప్‌ల ఆదేశాల మేరకు ఫ్లాగ్ మార్చ్ చేపట్టామన్నారు. ఓటు విలువైందని, ప్రతి ఒక్కరు నిర్భయంగా తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. పలు ప్రాంతాలలో అవగాహన కల్పించామన్నారు. ఈ మార్చ్‌లో చందానగర్ సీఐ పాలవెల్లి, డీఐ వెంకటేష్, ఎస్‌ఐలు, సీఐఎస్‌ఎఫ్, సీఆర్‌పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులకు సన్మానం



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించిన ప్రభుత్వ విప్ గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: భెల్ ఎంఐజీ కాలనీ అభివృద్ధికి తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గాన్ని స్థానిక కార్పొరేటర్ వి.సింధు ఆదర్శ్‌రెడ్డితో కలిసి మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షులు పి.వెంకట్రావ్ (ఎమ్మెల్యే), ఉపాధ్యక్షులు నారాయణ, కార్యదర్శి కెవీ.సుబ్బారావు, కోశాధికారి నీలకంఠరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెంకట్‌రెడ్డి, ఎంఎల్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి



చందానగర్ సర్కిల్ కార్యాలయంలో... ప్రతిజ్ఞ చేస్తున్న డీసీ వంశీకృష్ణ , సిబ్బంది



మాట్లాడుతున్న వీసీ ప్రొ.బీజేరావు

హఫీజ్‌పేట్ : భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చందానగర్‌లోని న్యూగుడ్ షెఫర్డ్ డఫ్ అండ్ డమ్ హై స్కూల్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ సర్దార్ న్యాయవాదిగా, స్వాతంత్య్ర సమరయోధుడిగా, అఖిలభారత కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడిగా, రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా, రైతు నాయకుడిగా, విశేష సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ మెర్సి ,అసోసియేషన్ సభ్యులు జిల్ మల్లేష్, జనార్దన్, కౌండిన్య ,నండూరి వెంకటేశ్వరరాజు, అధ్యాపకులు శోభ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చందానగర్ సర్కిల్ కార్యాలయంలో..


వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని చందానగర్ సర్కిల్ 2 కార్యాలయంలో ఉపకమిషనర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళుర్పించారు. ఈ సందర్భంగా ఐక్యతా దినోత్సవంలో భాగంగా కిందిస్థాయి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎంసీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏక్తా దివస్ ప్రతిజ్ఞ

గచ్చిబౌలి: సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిదాయకమని కొండాపూర్ టీఎస్‌ఎస్‌పీ 8వ బెటాలియన్ కమాండెంట్ సన్నీ పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్ బెటాలియన్‌లో సర్దార్ వల్లభాయ్ జయంతి నిర్వహించారు. సిబ్బందితో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ కె.సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్లు రెహమాన్, సత్యనారాయణ, నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ..

రాయదుర్గం: స్వాతంత్య్రం తర్వాత భారతదేశాన్ని ఏకం చేయడంలో సర్దార్ పటేల్ కీలకపాత్ర పోషించారని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని అంబేద్కర్ ఆడిటోరియంలో హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య పర్యవేక్షణలో నిర్వహించారు.



కొండాపూర్ బెటాలియన్‌లో ..

38 మందికి జరిమానా..

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 37 మందికి జరిమానా, ఒకరికి ఒకరోజు జైలుశిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌లో 38 మంది పట్టుబడ్డారని, వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 33 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల జరిమాన, ముగ్గురికి రూ.5 వేలు, ఒకరికి రూ.3 వేలు, మరో వ్యక్తి కి రూ.4 వేలు జరిమానాతో పాటు ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

16 లీటర్ల మద్యం పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ పరిధిలోని లేబర్ క్యాంపులో మద్యం అమ్ముతున్న రఘురాం అనే వ్యక్తిని మంగళవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 16 లీటర్ల మద్యాన్ని స్వాధీనం పరుచుకున్నారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమీన్‌పూర్ పరిధిలో.. 9 లీటర్లు

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా విక్రయించేందుకు తీసుకువచ్చిన తొమ్మిది లీటర్ల మద్యంను అమీన్‌పూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఈ.వి రమణ కథనం ప్రకారం ..అమీన్‌పూర్ పరిధిలోని బంధం కొమ్ముకు చెందిన మల్లేష్ బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం రావడంతో మంగళవారం దాడులు నిర్వహించి మద్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో మహిళ మృతి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు దాటుతున్న మహిళను బుల్లెట్ బండి ఢీకొన్న ఘటనలో మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ సురేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన మహేశ్వరి (50) మంగళవారం ఇస్నాపూర్ చౌరస్తాలోని మీ సేవకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా సంగారెడ్డి వైపు నుంచి వస్తున్న బుల్లెట్ వాహనం మహేశ్వరిని ఢీకొట్టింది.ఈ ఘటనలో మహేశ్వరి తీవ్రంగా గాయపడడంతో చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు

- ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి

పటాన్‌చెరు టౌన్: బెల్ట్ షాప్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి అన్నారు.మంగళవారం అమీన్‌పూర్ పరిధిలోని సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్క్ సమీపంలో కిరాణా షాపులో శ్రీధర్ అనే వ్యక్తి మద్యం విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం తెలుసుకున్న పోలీసులు, దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.2600 విలువచేసే మద్యంను స్వాధీనం చేసుకుని, విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

బీజేపీ మీడియా మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్‌గా విజిత్‌వర్మ

ఆల్విన్‌కాలనీ: బీజేపీ స్టేట్ మీడియా మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్‌గా విజిత్ వర్మను రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మంగళవారం నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అవకాశం ఇచ్చిన కిషన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. బీజేపీలో కష్టపడి పనిచేసిన వారిని పార్టీ గుర్తిస్తుందన్నారు. భవిష్యత్‌లో మరింత కష్టపడి పనిచేస్తానన్నారు.

దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలి



జడ్‌సీకి వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

రాయదుర్గం: శాసనసభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ రోజు దివ్యాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలని శేరిలింగంపల్లి దివ్యాంగుల పట్టణ సమాఖ్య నాయకులు కోరారు. జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డిలను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద దివ్యాంగుల కోసం వీల్ చైర్లు, ర్యాంపులు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ సమాఖ్య అధ్యక్షుడు మేకల అశోక్‌కుమార్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఫకీర్‌షబ్బీర్ రషీద్ ,కుమార్ పాల్గొన్నారు.

ప్రజలు బీఆర్‌ఎస్ వైపే.. హ్యాట్రిక్ ఖాయం



హుడా కాలనీలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో కాలనీవాసులతో గాంధీ

ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం ఖాయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో స్థానికులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తాయన్నారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలు లేకుండా ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేశామన్నారు. ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారన్నారు. మూడోసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తాన్నారు. కార్యక్రమంలో డివిజన్ల అధ్యక్షులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న జగదీశ్వర్ గౌడ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం నల్లగండ్లలోని ఆయన నివాసంలో పలు పార్టీల నాయకులకు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో పట్ల ప్రజలు ఆకర్షితులవున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ దూబే కాలనీ అధ్యక్షులు పిల్లి యాదగిరి, మల్లికార్జున్, ప్రవీణ్ కుమార్, నాగార్జున చారీ, వెంకట్‌సాయి కుమార్, ఏకాంతం, గజేందర్ దూబే, జి.నర్సింగరావు, శ్రీనివాస్, సత్యం, లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, మల్లేశం తదితరులు పార్టీలో చేరారు.

బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం తథ్యం



వాంబే కాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని భూదేవిహిల్స్, వాంబే కాలనీ, తులసినగర్‌లలో మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఇంటింటి ప్రచారం చేశారు. కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్‌యస్ పార్టీ అఖండ మెజార్టీతో అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో యువ నాయకుడు దొడ్ల రామకృష్ణగౌడ్, డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కాశీనాథ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, శివరాజ్‌గౌడ్, పాండుగౌడ్, వెంకట్ నాయక్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని నర్రబస్తి, నాయికోటి బస్తి, భగత్ గల్లీ తదితర ప్రాంతాలలో కార్పొరేటర్ మెట్టుకుమార్, ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్య వైద్య రంగంలో తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్‌గా ఉందన్నారు.కాంగ్రెస్ తెలంగాణకు చేసిందేమీ లేదని, అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మరోసారి మోసం చేయడానికి సిద్ధమైందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ ,డివిజన్ అధ్యక్షులు అఫ్జల్, బీఆర్‌ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓటేయండి

- కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని లేక్‌వ్యూ కాలనీలో ఎమ్మెల్యే గాంధీ కుమారుడు పృథ్వీ, కుమార్తె ప్రణీతతో హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ 9 సంవత్సరాల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూసి ఓట్లు వేయాలన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గాంధీకి భారీ మెజార్టీ అందించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా బహుమతి ఇవ్వాలన్నారు. బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: బీఆర్‌యస్ పార్టీ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సూచించారు. మంగళవారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని శేషాద్రి కమ్యూనిటీ హాలులో బీఆర్‌యస్ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులతో కలిసి పాల్గొన్నారు. గాంధీ మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని, యువత అంతా బీఆర్‌యస్ పార్టీ వైపే ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అడగాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించారు.

సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ పురుషుల జట్టు ఎంపిక



క్రీడాకారుల సెలక్షన్స్ సందర్భంగా బాస్కెట్‌బాల్ ఆడుతున్న వీసీ నరసింహారెడ్డి

బాలానగర్: జేఎన్‌టీయూలో సౌత్‌జోన్ బాస్కెట్ బాల్ పురుషుల జట్టు ఎంపిక కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా వైస్‌చాన్సలర్ ప్రొ. కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొ.మంజూర్ హుస్సేన్, ప్రిన్సిపాల్ ప్రొ. విజయ్‌కుమార్‌రెడ్డి, సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొ. డా.దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డా.ఎస్.అశోక్‌లు పాల్గొని క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు కేరళలో జరిగే సౌత్‌జోన్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూహెచ్ తరఫున పాల్గొంటారని పేర్కొన్నారు. మొత్తం వివిధ కళాశాలల నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో క్రీడాకారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. బాస్కెట్‌బాల్ కోర్టులో క్రీడాకారుల సెలక్షన్స్ నిర్వహించారు.

సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ల సమావేశం



సమావేశంలో పాల్గొన్న మునిరత్నం తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: బీజేపీ శేరిలింగంపల్లి సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ల సమావేశంలో కర్ణాటక మాజీ మంత్రి మునిరత్నం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సోషల్ మీడియా ఇన్‌చార్జ్ వీరుయాదవ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మునిరత్నం మాట్లాడుతూ.. సోషల్ మీడియా ద్వారా బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అబద్ధ ప్రచారాలను తిప్పి కొట్టాలన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలుపు దిశగా పరుగులు తీస్తున్న ఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల్, కృష్ణ, శ్రీనివాసులు, రవి, పవన్‌కుమార్, రవి కుమార్ యాదవ్, సుషాంత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.